క్లుప్తంగా

నెట్టికంటుడికి వెండి సామగ్రి వితరణ



వెండి సామగ్రి అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం అదే గ్రామానికి చెందిన దాత జి.రమాదేవి 2.165 కిలోల వెండి సామగ్రిని వితరణ చేశారు. హనుమద్ వ్రతం పూజా నిర్వహణకు ఉపయోగించుకునేలా వెండి ప్లేటు, వెండి శటారి, రెండు తీర్థం గిన్నెలు, ఐదు పంచ పాత్రలు, రెండు వెండి ఉద్ధరిను అర్చుకులకు దాత అందజేశారు. ఈసందర్భంగా దాత కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వృత్తి విద్య ఉపాధ్యాయురాలు శిరీష సూచించారు. శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండలంలోని రాయలచెరువు ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తూ 9, 10వ తరగతి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య విద్యపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో బాగంగా షాపింగ్ మాల్ సందర్శించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం డేనియల్, ఉపాధ్యాయురాలు లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వాసవి బాలమ్మ 'తరువన'



వాసవి బాలమ్మ తరువన కార్యక్రమ దృశ్యం

పామిడి: పట్టణంలోని వాసవి బాలమ్మ ఇనామ్ భూమిలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి బాలమ్మ 'తరువన' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవి మాతృమండలి సారథ్యంలో భక్తిప్రపత్తులతో సత్యనారాయణవ్రతం ఆచరించారు. అనంతరం వినాయక ఉత్సవ సమితి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వనభోజనాలను ఆరగించారు.

వంద పడకల ఆస్పత్రిగా మారుస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి: గుత్తి ప్రభుత్వాసుపత్రిని త్వరలోనే వంద పడకల ఆసుపత్రిగా మారుస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది బాగా పని చేయాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎల్లప్ప, టీడీపీ నాయకుడు నారాయణ, పట్టణ, మండల కన్వీనర్లు ఎంకె చౌదరి, బర్ధివలి తదితరులు పాలొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కన్వీనర్‌గా వైద్యాధికారి ఎల్లప్ప, సభ్యులుగా జబ్బార్ మియా (మున్సిపల్ కమిషనర్), ప్రభాకర్(ఎండీఓ), హేమలత (మహిళా సమాఖ్య సెక్రటరీ), కృష్ణ గోపాల్‌రెడ్డి(రిటైర్డ్ ప్రభుత్వ వైద్యులు), శ్రీనివాసులు, రమేష్ ఎన్నికయ్యారు.

వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి సమీపంలో ఉన్న బాట సుంకులమ్మ ఆలయం వద్ద వసతి గృహ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం భూమి పూజ చేశారు. వసతి గృహాలను లాభాపేక్ష లేకుండా భక్తులకు అందుబాటులో ఉంచాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం బాట సుంకులమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బర్ధివలి, మాజీ సర్పంచ్‌లు నరశింహులు, వెంకట్రాముడు, శ్రీనివాస్‌చౌదరి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మోదే శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

పామిడిలో ఇసుక, గరుసు అక్రమ రవాణా ఊపందుకుంటోంది. పట్టణ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమార్కులు ఇసుకను పట్టపగలే అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక, గరుసును గుత్తి, గుంతకల్లు, పామిడి అనంతపురం తదితర ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. టిప్పరు ఇసుక రూ.25 వేలు, టిప్పరు గరుసు రూ.12 వేల చొప్పున విక్రయిస్తూ రోజుకు రూ.లక్షల్లో అక్రమంగా వెనకేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పామిడి సమీపంలోని పెన్నానది నుంచి టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

సహజ సంపద కొల్లగొడుతున్నారు!

- యథేచ్ఛగా ఇసుక, గరుసు అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

పామిడి: పామిడి పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలివెళ్తోంది. రోజుకు వందలాది ట్రిప్పర్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులకు తెల్లబంగారం కాసుల పంట కురిపిస్తోంది. గుంతకల్లు, అనంతపురం, పామిడి, గుత్తికి ట్రిప్పర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. పట్టపగలే రోడ్ల కోసం అంటూ అక్రమంగా ఇసుక ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీంతో పెన్నానది అక్రమార్కులకు అడ్డాగా మారింది. పెన్నానదిలో ఒక టిప్పరు ఇసుకలోడ్‌కు ఓ అధికార పార్టీ నేత రూ.9 వేలు వసూలు చేస్తూ ఈ అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా ఇసుకను అక్రమ రవాణాను అక్రమార్కులు నిలిపివేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాయో? లేదో? ఇసుక అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. ఒక ట్రిప్పరు ఇసుక గుంతకల్లు అయితే రూ.25 వేలు, అనంతపురానికి రూ.30 వేలలు చొప్పున తరలిస్తున్నారు. అంతేకాకుండా అధికారపార్టీ నేతలు మండలంలోని కొండలను సైతం పిండిచేస్తూ గ్రావెల్‌ను అక్రమంగా తలిస్తున్నారు. పామిడి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాలకు వరుసగా రూ.8 వేలు, రూ.10 వేలు, రూ.12 వేలు చొప్పున అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు, ఇంటలిజెన్స్, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యమేమిటో? అన్న ఆరోపణలు మండల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు అలసత్వం వీడి సహజ సంపదలైన ఇసుక, గరుసు అక్రమ రవాణాను అరికట్టి, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే ప్రమాదాలను నివారించాల్సిన అవసరమైంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం



పామిడి పెన్నానది నుంచి తెల్లబంగారం అక్రమంగా తరలిపోతోంది. దీంతో ఇసుక దిన్నెలతో కళకళలాడాల్సిన పెన్నానది కళావిహీనంగా మారుతోంది. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదముంది. దీంతో వ్యవసాయ, గృహ వినియోగ బోర్లలో నీరు తగ్గుతాయి. తద్వారా వేసవి రాకనే మండల ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడే ఆస్కారం లేకపోలేదు.

–డీ అల్లీపీరా, పామిడి

అధికారులు స్పందించాలి



మండలంలోని కొండలు సైతం పిండి అవుతున్నాయి. గరుసు అక్రమంగా తరలివెళ్తోంది. దీంతో కొండలు తరించుకుపోతున్నాయి. ఇది ప్రకృతి వైపరీత్యాలకు దారి తీసే అవకాశం ఉంది. సకాలంలో వర్షాలు కురువక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కొండలు హరించి పోకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరమైంతైనా ఉంది.

–పీ వరప్రసాద్, పామిడి

చర్యలు తీసుకుంటాం



పామిడి పెన్నానది నుంచి అక్రమంగా తరలివెళ్తూ పట్టుబడ్డ ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధిస్తున్నాం. ఇకపోతే రాత్రివేళ ట్రిప్పర్లలో ఇసుక, గరుసు తరలివెళ్తున్న విషయం తెలిసింది. ఈ అక్రమ రవాణా నుంచి సహజ సంపదలైన ఇసుక, గరుసు సంరక్షణకు చర్యలు చేపడతాం. ప్రత్యేకంగా వాటి అక్రమ రవాణాలను అరికట్టేందుకు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

–ఎన్.శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

భూ సమస్య పరిష్కరించండి



భూమికి సంబంధించిన డీ పట్టా చూపుతున్న రైతు

గార్లదిన్నె: భూ సమస్య పరిష్కరించాలని బాధిత రైతు సుబ్బరాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూ సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకూ భోజనం చేయకుండా నిరీక్షించినా మా గోడు వినేవారు ఎవరు లేరన్నారు. బూదేడు గ్రామ రెవెన్యూ పొలం 100–2 సర్వే నంబర్‌లో 1991లో తనకు 2–90 ఎకరాలకు ప్రభుత్వం డీపట్టా మంజూరు చేసిందన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు భూమి సర్వే చేసి నాకు 2.90 ఎకరాలు ఉండాల్సి ఉండగా, కేవలం 1.60 ఎకరాలు మాత్రమే సాగు భూమి ఉందని తెలిపారన్నారు. మిగిలిన 1.30 ఎకరాలు పక్క రైతు పొలంలో ఉందని అధికారులు సూచించారన్నారు. నా భూమిని సర్వే అధికారులు మిగులు భూమి కింద నమోదు చేశారన్నారు. అలాగే నా తమ్ముడు ఓబిలేసుకు చెందిన 1.80 ఎకరాలు, నాకు చెందిన 1.60 ఎకరాల భూమి జాయింట్ కింద నమోదు చేశారన్నారు. అన్నదమ్ములు ఇద్దరికి 4.70 ఎకరాలు భూమి ఉండాలన్నారు. కానీ ఇద్దరికీ కేవలం 3.40 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. భూ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్న కాలయాపన చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేకుంటా కుటుంమంతా ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా వైవీఆర్ జన్మదిన వేడుకలు

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/పామిడి: మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మెడ (సర్వికల్ స్పాండిలోసిస్)కు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన కుమార్తె నివాసంలో విశ్రాంతి పొందుతున్న వైవీఆర్‌ను నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీశ్రేణుల సమక్షంలో వైవీఆర్ కేక్‌ను కట్ చేశారు. అలాగే గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో యువనేత మంజునాథరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీఆర్.ఖలీల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు తిమ్మప్ప, ముని ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. పార్టీ యువ నాయకుడు వాల్మీకిపవన్ ఆధ్వర్యంలో అమృత వర్షిణి బాల కళ్యాణ ఆశ్రమంలో బాలల నడుమ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. వైవీఆర్ త్వరగా కోలుకోవాలని హజరత్ మస్తాన్‌వలి దర్గా, భవానీ చంద్రశేఖర్ స్వామి ఆలయాల్లో పార్టీ కార్యకర్తలు పూజలు చేశారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హైదరాబాద్ వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.



హైదరాబాద్‌లో పార్టీశ్రేణుల నడుమ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్



గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న యువనేత మంజునాథరెడ్డి

బాల్య వివాహాలు నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీలో లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయకూదన్నారు. బాలురతో సమానంగా బాలికలను చదివించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ నిర్మల, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం విజయలక్ష్మి, రాయల చెరువు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ అరికట్టాలి'

గుంతకల్లు: పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్స కోసం రాత్రి పూట వెళ్లే రోగులను ప్రైవేట్ ఆస్పత్రుల్లో వెంటనే ఆడ్మిట్ చేసుకోవడం లేదన్నారు. పగటి పూట చికిత్సకు ఓ ఫీజు.. రాత్రి పూట చికిత్స మరో ఫీజు అంటూ పేద ప్రజల నుంచి వైద్యులు ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుల్ఫోరోజ్, ఫిరోజ్‌ఖాన్, జిలాన్, ఖాదర్‌వలి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి



ఏఎస్ఐ తిమ్మరాజులు

శింగనమల: శింగనమల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తిమ్మరాజులు ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనను అభినందించారు.

జనన ధ్రువీకరణ పత్రాల కోసం అగచాట్లు



తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారుల కోసం ఎదురు చూస్తున్న జనం

గార్లదిన్నె: తల్లిదండ్రులు తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల కోసం కష్టాలు పడుతున్నారు. వివరాలు.. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికీ అపార్ సంఖ్య నమోదు చేస్తున్నారు. దీంతో జనన ధ్రువీకరణ పత్రాలు పొందేం దుకు అధికారుల సంతకాలు కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవస్థలు వర్ణణాతీతం. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు మాట్లాడుతూ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓ సంతకాలు కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయం వద్దే వేచి ఉన్నామన్నారు. అయితే రెవెన్యూ అధికారులంతా గార్లదిన్నె సమీపంలో ఓ వ్యవసాయ తోటలో కార్తీక వనభోజనాలకు వెళ్లారన్నారు. మరి కొంత మంది సిబ్బంది ఫీల్డుకు పోవడంతో సాయంత్రం అయినా ఎవరూ రాలేదన్నారు. వ్యవసాయ పనులు వదులుకుని సంతకాల కోసం వస్తే కనీస సమాచారం కూడా ఎవరూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంతకాల కోసం వారాల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పనులు జరగడం లేదన్నారు. మరి కొంత మంది రైతులు వీఆర్‌ఓ సంతకాలు కోసం వచ్చి సాయంత్రం వరకు ఎదురుచూసి ఉసూరుమంటూ ఇంటికి వెళ్లారు.

ముగ్గురిపై కేసు నమోదు

పామిడి: పట్టణంలోని పామిడమ్మవీధికి చెందిన బోయ పిక్కిలి రాజాపై అదేవీధికి చెందిన బోయ వంశీ దాడి చేయడంతో.. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. గతంలో పామిడమ్మ తేరు ఉరుసులో రాజా, వంశీ నడుమ తగాదా ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న వంశీతో పాటు మరో ఇద్దరు కలసి పిక్కిలి రాజాపై కట్టెలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పిక్కిలి రాజా తలకు, చిటికెన వ్రేలుకు రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వంశీతో పాటు అతని వర్గీయులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన మాణిక్య, బొలికొండ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధితో పాటుగా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం మండలంలోని తొండపాడు గ్రామంలోని శ్రీరంగ కల్యాణ మండపంలో కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

ఓటింగ్ సరళిపై అవగాహన



బ్యాలెట్ బాక్స్‌ను చూపుతున్న అధికారులు

గుంతకల్లు: డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల పోలింగ్ సరళిపై ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ అవగాహన కల్పించారు. పోలింగ్‌లో అనుసరించాల్సిన విధానం? ఓటర్లు ఏ విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి? ఏ టైమ్ వరకూ ఓటింగ్‌లో పాల్గొనవచ్చు? పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను ఏవిధంగా కేంద్రాలకు తరలించాలి తదితర విషయాలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ్ నాయకుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ మహిళా కార్మికుల ప్రచారం

గుంతకల్లు: డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ నేతృత్వంలో మహిళా నేతలు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే ఏరియాల్లోని పలు వీధుల్లో కలియ తిరిగారు. అనంతరం డీజిల్ షెడ్‌లోని ప్రతి కార్మికుడినీ కలసి మజ్దూర్ యూనియన్ గుర్తు అయిన ఫ్లాగ్ (జెండా) గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ సహాయ కార్యదర్శి ఆశ్విని, డీఆర్ఎం బ్రాంచ్ సహాయ కార్యదర్శి శ్రీవల్లి, నాయకురాళ్లు విజయ్ బాయ్, హారిక, ఫరీదా, సునీతా రాజ్, లక్ష్మీ, వై.సుధాకర్, రాజ్‌కుమార్, ఎస్ఎం భాషా, జాఫర్‌ఖాన్, మజ్దూర్ యూనియన్ మాజీ సహాయ కార్యదర్శి ఎస్.మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



బిల్వ అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు



పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అలంకరణలో సింగరప్పస్వామి



సింగరప్ప ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

తాడిపత్రి అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పెన్నానది తీరాన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మూలవిరాట్‌కు లక్ష బిల్వార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శంకరశర్మ ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం, కలశ స్థాపన, గణపతి పూజ, సుబ్రహణ్యస్వామి పూజ, నాగదేవతల పూజ, సకల దేవతల పూజ అత్యంత వైభవంగా చేపట్టారు. ముందుగా స్వామికి అర్చన చేసే బిల్వ పత్రాలను సాంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చిన ధర్మకర్తలమండలి సభ్యులు అర్చకులకు అందజేశారు. బిల్వ పత్రాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బుగ్గరామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకుని పునీతులైయ్యారు. హరహరమహాదేవ శంభో శంకర అన్న శివ ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శుక్రవారం మాస శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్ భోగేశ్వరుడితోపాటు ప్రసన్న పార్వతిదేవిని ప్రత్యేకంగా అంకరించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ మంత్రోచ్చారణల నడుమ అభిషేకార్చన, నందిపూజ వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అల్పహార వితరణ గావించారు. అనంతరం ఆదిదంపతులైన శివపార్వతి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తుల శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది.

ఘనంగా త్రయోదశి పూజలు

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయం, పెన్నానది ఒడ్డు సింగరప్ప కొండపై క్షేత్ర పాల సింగరప్ప ఆలయంలో శుక్రవారం రంగ సుభే ఫిర్కా ఆధ్వర్యంలో కార్తీకమాస త్రయోదశి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లోని చిన్న విఠోబస్వామి, సింగరప్పను శోభాయానంగా అలంకరించారు. అర్చకులు తేజశర్మ మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిప్రపత్తులతో పాండురంగుడుని, పరమశివుని తిలకించి తరించారు. భజన బృందం ఆలపించిన భక్తి సంకీర్తనాలాపనలు భక్తులను పరవశింపజేశాయి. అనంతరం సింగరప్ప కొండపై భావసార క్షత్రియులు కులవిందును ఆరగించారు. కార్యక్రమంలో భావసారక్షత్రియ సమాజ్ అధ్యక్షుడు టీటీ నాగభూషణంరావు, సెక్రెటరి టీటీ శ్రీనివాసరావు, చౌదరి, రమేష్, ఉత్తర్కర్ మంజునాథ్‌రావు, భజన మండలి ఉపాధ్యక్షుడు టీకే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



గార్లదిన్నె: మండలంలోని కొట్టాలపల్లి, కమలాపురం, కేకేతండా, కేశవాపురానికి వెళ్లే తారురోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందిపడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. నిత్యం గ్రామం ప్రధానరోడ్డులో ఇసుక ట్రాక్టర్లు అధిక లోడ్‌తో వెళ్లడంతో తారు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామీణులు కోరారు.